

మహబూబ్‌నగర్ టౌన్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పాలమూరు ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



జడ్చర్ల టౌన్:అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్



మహబూబ్‌నగర్ టౌన్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు



భూత్పూర్‌లో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్

## అంబేద్కర్ ఆశయ సాధనకు
# పాటుపడుదాం

- ఘనంగా రాజ్యాంగ నిర్మాత వర్ధంతి
- నివాళులర్పించిన పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, ఇతర ప్రముఖులు
- వెన్నాచేడ్‌లో యువకుల రక్తదానం

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడదామని జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జడ్చర్లలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్, అంబేద్కర్ సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

- నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 6



వెన్నాచేడ్‌లో రక్తదానం చేస్తున్న యువకులు



మదనాపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నందారంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కోయిలకొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

# ప్రజా సమస్యలపై పోరాడుతాం

- బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాలూనాయక్



మాట్లాడుతున్న బాలూనాయక్

బాలానగర్, డిసెంబర్ 6 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాలూ నాయక్ తెలిపారు. ఫలితాలు నిరాశపర్చినా భవిష్యత్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతామని స్పష్టం చేశారు. బుధవారం పెద్దాయపల్లి శివారులో బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమై మాట్లాడారు. లక్ష్మారెడ్డి ఓటమితో ఆధైర్యపడొద్దని, ఆత్మస్థైర్యంతో ముందుకు పోదామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గెలుపోటములు సహజమన్నారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలను మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని, ప్రస్తుత ఎమ్మెల్యే మరింత అభివృద్ధి చేయాలని కోరారు. అభివృద్ధికి బీఆర్‌ఎస్ నాయకులు సహకరిస్తారని, అభివృద్ధిని విస్మరిస్తే తప్పకుండా నిలదీస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని, లేదంటే ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. ఆరు నెలలపాటు వారి పాలనా విధానాన్ని గమనిస్తామని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే బీఆర్‌ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడు రమేశ్‌నాయక్, నాయకులు రవి, రవీందర్‌నాయక్, శ్రీనివాసాచారి, రాజూ నాయక్, గోపినాయక్, చందూ నాయక్, రవినాయక్, దస్రూ నాయక్ తదితరులున్నారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం

జడ్చర్ల, డిసెంబర్ 6 : జడ్చర్ల మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో గురువారం మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న పైప్‌లైన్‌ను తరలిస్తున్నామని, మంచినీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. పట్టణంలోని 6, 7, 13, 21, 22, 23, 24, 25, 27వ వార్డుల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు. పనులు పూర్తికాగానే మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

## పారిశుధ్య చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ యాదయ్య

కోయిలకొండ, డిసెంబర్ 6 : గ్రామాల్లో పారిశుధ్య చర్యలు పాటించాలని అదనపు కలెక్టర్ యాదయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు ప్రబలవన్నారు. పంచాయతీలో వందశాతం పన్ను వసూలు చేయాలని సూచించారు. గ్రామాల వారీగా ఉపాధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో జయరాం, సూపరింటెండెంట్ హరీశ్‌రెడ్డి, ఏపీవో పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలి

జడ్చర్ల టౌన్, డిసెంబర్ 6 : పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీసేన నాయకులు డిమాండ్ చేశారు. జడ్చర్లలోని మండల విద్యా మానవ వనరుల కేంద్రం ఆవరణలో బుధవారం బీసీసేన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీసేన జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీలపై కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ కుల గణన చేపట్టాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నిరంజన్, నర్సింహులు, చంద్రమౌళి పాల్గొన్నారు.

## పీయూ కెమిస్ట్రీ బీవోఎస్ చైర్‌పర్సన్ నియామకం

పాలమూరు, డిసెంబర్ 6 : పాలమూరు విశ్వవిద్యాలయంలో ఐదేండ్ల ఇంటిగ్రేడ్ కెమిస్ట్రీ విభాగంలో పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.చంద్రకిరణ్, రసాయనశాస్త్ర విభాగంలో డా.నూర్జహాన్‌ను బీవోఎస్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ పీయూ రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డా.శ్రీధర్‌రెడ్డి, హెచ్‌వోడీ రామ్మోహన్, ఆయేషాహస్మి, రవికుమార్, విద్యార్థులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జడ్చర్ల టౌన్, డిసెంబర్ 6 : మండలంలోని అమ్మపల్లి శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో జడ్చర్ల పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఆరు ట్రాక్టర్లను జడ్చర్ల పీఎస్‌కు తరలించి యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రమేశ్ బాబు తెలిపారు.

## చెక్‌డ్యాం వద్ద తూం ఏర్పాటు చేయాలి

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 6 : చెక్‌డ్యాం వద్ద తూం ఏర్పాటుచేయాలని మండలంలోని గుడిబండ రైతులు కోరారు. బుధవారం మండలంలోని కందూరు స్టేజీ వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యాంకు తూం ఏర్పాటు చేయాలని, గ్రామస్తులు, రైతులు చెక్‌డ్యాం వద్దకు వెళ్లి కాంట్రాక్టర్‌ను కోరారు. సంబంధిత అధికారుల సూచన మేరకు పనులు చేస్తామని, ఈ విషయాన్ని కూడా వారికి చెప్తానని కాంట్రాక్టర్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గుడిబండ వాగు కాల్వకు నీళ్లు వెళ్లేలా తూం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## బాదేపల్లి మార్కెట్‌కు 15,481 మెట్రిక్ టన్నుల ధాన్యం

జడ్చర్ల, డిసెంబర్ 6: జడ్చర్లలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును బుధవారం డీఏవో వెంకటేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి మార్కెట్‌యార్డుకు వచ్చిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. సన్న, దొడ్డురకం ధాన్యం ధరలు ఎలా ఉన్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల నేపథ్యంలో ఆరబోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గాక ఆలస్యంగా వరికోతలు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు బాదేపల్లి మార్కెట్‌లో 15,481 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసులు, ఏవో గోపీనాథ్ తదితరులున్నారు.

## గ్రామీణ పరిస్థితులు, వనరులపై అవగాహన

కొత్తకోట, డిసెంబర్ 6 : గ్రామీణ పరిస్థితులు, వనరులపై గ్రామస్తులకు కేవీకే ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని కనిమెట్టలో మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల హైదరాబాద్ సహకారంతో విద్యార్థులకు గ్రామ ముఖచిత్రం, వనరులు, విద్య, వైద్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా సాగయ్యే ముఖ్య పంటలు, వాటిని ఆశించే చీడపీడలు, సమగ్ర పోషకాలు, యాజమాన్యం, జీవ ఎరువులు, అధిక రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాణి, శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి, ఏఈవో శృతి, కోఆర్డినేటర్ గిష్మ, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్ 6 : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ విద్యార్థి ఖాజా మైనొద్దీన్ ఎంపికయ్యాడు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్ అతడిని అభినందించి జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

**బాస్కెట్‌బాల్ టోర్నీకి..**

రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు జిల్లా కేంద్రంలోని అపెక్స్ స్కూల్ విద్యార్థులు (బాలికల జట్టుకు పారిజాత, సిరి, బాలురు జట్టుకు యశ్వంత్, వరుణ్‌కుమార్) ఎంపికయ్యారు. వారిని స్కూల్ డైరెక్టర్ రామారావు అభినందించారు.



జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుతో డీవైఎస్‌వో శ్రీనివాస్

## రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలి

- డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్ 6 : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజయం సాధించాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాలలో 8 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్లు ఎంపికను బుధవారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జియావుద్దీన్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.